## క్లుప్తంగా

### కుమారస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేంము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

### నందీశ్వరస్వామికి విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనగన బసవన్నగా పేరొందిన నందీశ్వరునికి, క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధి గాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

### చెత్తను పడేయొద్దు


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: ఇళ్లలోని చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయొద్దని, పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు చెత్త బండ్లలోనే వేయాలని పంచాయతీ కార్యదర్శి నాగశేషులు ప్రజలను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో హరిత రాయబారులతో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా టబ్బులలో నిల్వ ఉంచుకుని, పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు.

### 28 మంది బైండోవర్


మద్యం విక్రయ దారులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గతంలో మండల పరిధిలోని అక్రమంగా మద్యం విక్రయించిన 28 మందిపై మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. అనంతరం తహసీల్దార్ ఉమారాణి ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కేశవ్ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నాటుసారా అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు.

### సమస్యలు పరిష్కరించండి

నందికొట్కూరు: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ నాయకుడు చంద్రశేఖర్ కోరారు. మంగళవారంఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మకు కూడిన వినతి పత్రం అందజేశారు. పని ఒత్తిడి తగ్గించాలని, సర్వేలను మినహాయింపు ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నూరుల్లా, శాంత య్య, చెన్నయ్య, సతీష్, రాజశేఖర్, రహిం, మూర్తుజా వలి, తరుణ్, శివన్న, లోకేష్ పాల్గొన్నారు.

### నేడు భాస్కరాపురం సీనియర్ మేట్‌పై విచారణ

జూపాడుబంగ్లా: మండలంలోని భాస్కరాపురం గ్రామానికి చెందిన సీనియర్ మేట్(ఫీల్డ్ అసిస్టెంట్) బి.నరసింహపై ఆత్మకూరు ఏపీడీ విచారణ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 18వ విడత సామాజిక తనిఖీలో సీనియర్ మేట్ నరసింహపై వచ్చిన ఆరోపణలు, భాస్కరాపురం గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

### ఉపాధి కూలీలకు అవగాహన

జూపాడుబంగ్లా: ఎండల తీవ్రతపై హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు మంగళవారం ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. భాస్కరాపురం గ్రామ పరిధిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి తరచూ నీరు తాగాలని, ఎండలు వచ్చేలోపే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దార సుధీర్
- యువత పోరు వాల్ పోస్టర్ల విడుదల


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్, నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో బుధవారం (12న) నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న యువత పోరు కార్యక్రమ వాల్ పోస్టర్లను మంగళవారం పార్టీ కార్యాలయంలో దార సుధీర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులను తాకట్టు పెట్టి పిల్లల ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి తల్లిదండ్రులకు ఏర్పడిందన్నారు. ఉద్యోగాల నోటిఫికేన్లు విడుదల చేయకుండా, నిరుద్యోగభృతి ఇవ్వకుండా నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మభ్య పెడుతోందన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే డీఎస్సీపై తొలి సంతకం చేసిన చంద్రబాబు నాయుడు.. పది నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన 21 నోటిఫికేషన్లకు ఇంత వరకు పరీక్షలు కూడా నిర్వహించలేదన్నారు. యువతను, నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్ నాయబ్, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, మాధురి, తులసిరెడ్డి, మన్సూర్, తిరుమలేశ్వరరెడ్డి, జబ్బార్, అబుబక్కర్, లోకేష్‌రెడ్డి, విజ్జి, మల్లేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, నాగసేనారెడ్డి, రాజు, చరణ్, నాగరాజు, రవి పాల్గొన్నారు.

## యువత పోరుకు తరలిరండి

ఆత్మకూరురూరల్: విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 12(బుధవారం)న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్ రెడ్డి కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం యువత పోరు ప్రచార పోస్టర్‌ను విడుద చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు యువతకు, విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఒక్కటి కూడా అమలు చేయకపోవడం తగదన్నారు. విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.4,600 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముస్తఫా, రామచంద్రయ్యశెట్టి, బాలస్వామి, సుల్తాన్, రహిమాన్, విజయ్, ప్రకాష్, కలిముల్లా, దర్గా రియాజ్, మునీర్, ధను, దర్గమ్మ, పార్వతి, బాషా పాల్గొన్నారు.


యువత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ


కంది పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పాములపాడు: వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వేంపెంట, చెలిమిల్ల గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కంది పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పంట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది పైర్లకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందని, దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయని రైతులు వాపోయారు. రసాయన ఎరువులు, మందుల వాడకం తగ్గించి భూములను కాపాడుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి పాల్గొన్నారు.


## సర్వేల పట్ల నిర్లక్ష్యం చేయరాదు

- డీఎల్‌డీఓ సూర్యనారాయణ


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సూర్యనారాయణ

పాములపాడు: ప్రభుత్వం చేపట్టిన సర్వేల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని డీఎల్‌డీఓ సూర్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వేంపెంట, బానకచెర్ల గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. విధులకు సమయానుకూలంగా హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వ సర్వేలైన పీ-4, ఎంఎస్ఎంఈ, చైల్డ్ ఆధార్‌ల సర్వేలు ఎలా కొనసాగుతున్నాయని ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

## నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంక్


నిరుపయోగంగా మారిన ఓవర్‌హెడ్ ట్యాంక్

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట సంతగేట్ ఆవరణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. ట్యాంక్ పై కప్పు పెచ్చులూడి నీటి భాండాగారంలో పడడంతో నీటి నిల్వ చేయడం లేదని ఫిట్టర్ బాబు వెల్లడించారు. దాదాపు ఏడాది కాలంగా ఈ సమస్య నెలకొన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిచిపోవడం వల్ల స్థానికులకు నీటి అవసరాలు తీరక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరగడంతో నీటి అవసరత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా మారినా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పెచ్చులూడి పడుతున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పై కప్పు స్థానంలో మరమ్మతులు చేపట్టి ట్యాంక్‌కు నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై మండల ఈఓఆర్డీ నాగేంద్రయ్యను వివరణ కోరగా మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వీధిదీపాల చోరీ

జూపాడుబంగ్లా: కేజీ రోడ్డు నుంచి తాటిపాడు గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న నాలుగు విద్యుత్‌స్తంభాల వీధిదీపాలు చోరీకి గురైనట్లు సర్పంచ్ వంగల లక్ష్మీదేవమ్మ మంగళవారం తెలిపారు. రూ.15వేల విలువైన నాలుగు విద్యుత్ దీపాలు చోరీకి గురైనట్లు తెలిపారు. ఇదే విషయాన్ని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## ఖాళీ బోటు బోల్తా


సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో బోల్తా పడిన బోటు

కొత్తపల్లి: కృష్ణానదిలో నిలిచి ఉన్న ఖాళీ బోటు బోల్తా పడిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఆత్మకూరు ఫారెస్టు డివిజన్‌కు సంబంధించి రివర్ పెట్రోలింగ్ కోసం ప్రభుత్వం అటవీ శాఖకు ఒక బోటు మంజూరు చేసింది. దానిని ఫారెస్టు అధికారులు కృష్ణానదిలో సంగమేశ్వరం నుంచి శ్రీశైలం తరలించేందుకు సంగమేశ్వరం వద్ద ఉంచారు. సోమవారం రాత్రి ఈదురు గాలులు ఎక్కువగా రావడంతో బోటు నీటిలో తిరిగి బోల్తా పడింది. ఈ విషయంపై మంగళవారం ఫారెస్టు రేంజ్ అధికారి పట్టాభిని వివరణ కోరగా బోటు నదిలో బోల్తా పడిన విషయం నిజమేనని, వెంటనే సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని యథాస్థానంలో ఉంచామని వెల్లడించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు


సర్పంచు భాగ్యమ్మను సన్మానిస్తున్న దృశ్యం

పాములపాడు: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని శ్రీశైలం పీఠాధిపతి భువనేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయం ఆవరణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం సర్పంచు మేకల భాగ్యమ్మ, మహిళా ఉద్యోగులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు గులాబ్‌షా, సావిత్రమ్మ, కంటి వైద్యుడు షేక్షావలి, డాక్టర్ అల్తాఫ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దామోదర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

## నాటు సారా జోలికెళ్లొద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్

నందికొట్కూరు: నాటు సారా జోలికి వెళ్లి జీవితాలను సర్వ నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో 2.0 నవోదయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. సాంఘికంగా, ఆర్థికంగా, చట్ట పరంగా నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం 2.0 నవోదయ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచు సుశీలమ్మ, బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు, ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా, అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమారి పాల్గొన్నారు.

### శ్రీశైలంలో నేడు కామదహనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి పాల్గుణ శుద్ధ చతుర్దశి ఘడియలు రానుండటంతో కామదహనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయం ముందుభాగంలోని గంగాధర మండపం వద్ద బుధవారం సాయంత్రం 6.30 గంటలకు కామదహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

### డిగ్రీ కళాశాలలో శక్తి యాప్ రిజిస్ట్రేషన్‌లు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం శక్తి యాప్ రిజిస్ట్రేషన్ ప్రకియను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా ప్రారంభించారు. విద్యార్థినులకు శక్తి యాప్ ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విపత్కర పరిస్థితుల్లో సాయం పొందొచ్చని సూచించారు.

### గృహ లబ్ధిదారులకు అదనపు నిధులు

పాములపాడు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహ లబ్ధిదారుల అసంపూర్తి నిర్మాణాలకు అదనపు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం జీఓ నెంబరు 09 ప్రకారం గతంలో ఇండ్లు మంజూరై బేస్‌మెంట్ లెవెల్, రూఫ్‌లెవెల్‌లో ఉన్నటువంటి వారు అర్హులన్నారు. బీసీ, ఎస్సీ కులాల వారికి రూ.50,000, ఎస్టీలకు రూ.75,000, చెంచులకు రూ.1,00,000 చొప్పున అదనపు బిల్లులు చెల్లించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### పోలీస్ స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నాపత్రాలు

పగిడ్యాల: ఈనెల 17నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల సెట్ -1, సెట్ -2 ప్రశ్నాపత్రాలు మంగళవారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు చేరినట్లు రూట్ ఆఫీసర్, ఎంఈఓ సుభాన్ తెలిపారు. మండల వ్యాప్తంగా 460 మంది విద్యార్థులక గానూ మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రూట్ ఆఫీసర్‌గా ఎంఈఓ -2 మురళీమోహన్‌రెడ్డి, ఎగ్జామ్ చీఫ్‌లుగా మధుసూదన్‌రావు, వెంకటస్వామి, క్రిష్ణమూర్తి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా ఎల్లనాయుడు, జిలానీ, రఫీలను నియమించినట్లు ఆయన తెలిపారు.

### సచివాలయాల కుదింపు

- ఆందోళనలో ప్రజలు

శ్రీశైలంప్రాజెక్ట్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయాల సంఖ్యను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కుదించేందుకు చర్యలు తీసుకుంది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీశైలం మండలంలో 4 సచివాలయాలను ఏర్పాటు చేసి, తగినంత సిబ్బందిని నియమించి ప్రజలకు సత్వర పౌరసేవలను అందించారు. అయితే కూలమి ప్రభుత్వం నాలుగింటిలో రెండింటిని తొలగించి మిగతా రెండింటితోనే సర్దుబాలు చేసుకుందుకు నడుంబిగించింది. అందులో భాగంగానే ఎంపీడీఓ ఉత్తర్వులు జారీ చేశారు. భౌగోళిక ప్రాంత పరిస్థితుల దృష్ట్యా సున్నిపెంటలో 3 సచివాలయాలు, శ్రీశైలదేవస్థానంలో 1 సచివాలయం ఏర్పాటు చేశారు. 1, 2 సచివాలయాలు ఈస్ట్రన్ కాలనీ ప్రజల సౌకర్యార్థం, 3వ సచివాలయం వెస్ట్రన్ కాలనీ ప్రజలతో పాటు, లింగాలగట్టు మజారా గ్రామప్రజల సౌకర్యార్థం, 4వ సచివాలయం శ్రీశైల దేవస్థానంలోని ప్రజల కోసం ఏర్పాటు చేశారు. సచివాలయాల కుదింపులో భాగంగా 3వ సచివాలయ పరిధిలో ఉన్న లింగాలగట్టు గ్రామ ప్రజలు, సున్నిపెంటలోని వెస్ట్రన్ కాలనీ ప్రజలు పౌరసేవలు పొందాలంటే శ్రీశైలంలోని 4వ సచివాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. సచివాలయాల కుదింపుతో సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

### తల్లి హత్య కేసులో కుమారుడి అరెస్ట్

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో మద్యం మత్తులో కన్నతల్లిని హత్యచేసిన కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న బాల గురప్ప అలియాస్ బాలగురువయ్య చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో తల్లి అంబటి చిన్న పుల్లమ్మపై రోకలిబండతో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో జమ్మలమడుగు రస్తాలో మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుడిని కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వెల్లడించారు.

## ప్రతి పనిలో పురోగతి సాధించాలి

- రీ సర్వేలో పొరపాట్లకు తావుండకూడదు
- ఆర్డీఓ నాగజ్యోతి


భూముల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీ నాగజ్యోతి

పాములపాడు: ప్రతి పనిలో పురోగతి సాధించాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని కంబాలపల్లి గ్రామంలో చేపట్టిన రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సర్వే బృందంతో మాట్లాడారు. సంబంధించిన వివరాలను ల్యాప్ టాప్, మ్యాప్‌లో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో 322 మంది రైతులకు ఖాతా నంబర్లున్నాయని, వారందరికి నోటీసులు పంపించామన్నారు. ఇప్పటికీ భూముల్లో క్షేత్రస్థాయిలో సర్వే ముగిసిందని, రికార్డుల్లో నమోదు పనులు జరుగుతున్నాయన్నారు. జాయింట్ ఎల్‌పీఎంకు సంబంధించి జిల్లా కలెక్టర్ నుంచి నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో 5 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, జీపీఆర్ఎస్, నేషనల్ హైవే అప్‌డేట్ తదితర వాటిపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారణ చేయాలని, ఒక సారి నిర్ధారించిన తరువాత ఎక్కడికెళ్లినా ఒకే ఫలితం ఉండాలన్నారు. సమస్యలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ, డీఐ ఉమాపతి, సర్వేయర్ కలిముల్లా పాల్గొన్నారు.

## ఈఓపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న హిందూ ధార్మిక సంఘం నాయకులు, హిందువులు, భక్తులు

నందికొట్కూరు: దేవాలయాల నగదును కాజేసిన ఈఓ వెంకటరమణపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని హిందూ ధార్మిక సంఘం నాయకులు భాస్కరరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, మురళీ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ఈఓ వెంకటరమణను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ హిందూ ధార్మిక సంఘం నాయకులు, హిందువులు పెద్ద సంఖ్యలో బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంజనేయస్వామికి చెందిన వంద ఎకరాల భూమి గుత్తా డబ్బు రూ.కోటి, సుంలమ్మ ఆలయానికి సంబంధించిన రూ.60 లక్షలు కాజేసిన ఈఓపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. 2019-2025 వరకు వేలం పాటలు వేయకుండా సుంకులమ్మ ఆలయానికి చెందిన ఆరు దుకాణాలను ఇష్టం వచ్చిన వారికి ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు డబ్బు గురించి అడిగినప్పుడు మాత్రమే అకౌంట్‌లో ఉన్నట్లు బ్యాంకు పాస్ బుక్ చూపించి, మళ్లీ బ్యాంక్‌కు వెళ్లి చూస్తే బ్యాంకు ఖాతా ఖాళీగా చూపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాలకు చెందిన సుమారు 18 ఆలయాలకు ఈఓగా విధులు నిర్వర్తించడమే గాకుండా సుమారు రూ.15 కోట్ల వరకు కాజేశాడని ఆరోపించారు. సీబీఐతో విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. సుమారు గంట పాటు కేజీ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. కార్యక్రమవంలో హిందువులు కాంతారెడ్డి, వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

### సర్టిఫికెట్ల పంపిణీ


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో అధికారులు

వెలుగోడు: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన 40 మంది మహిళలకు మంగళవారం డీఆర్డీఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వ పథాకల ద్వారా, బ్యాంకు నుంచి రుణాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రవీంద్ర బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ శ్రీకాంత్ రెడ్డి, కెనరా బ్యాంకు మేనేజర్ సూర్యదేవార నాయక్, నంద్యాల క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య, డీపీఎం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## జాబితాలో పేర్లు సరిచూసుకోండి

- జిల్లా వనరుల కేంద్రం అధికారిణి హేమలత


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం అధికారిణి హేమలత

ఆత్మకూరు: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని, పేర్లు సరిచూసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం అధికారిణి హేమలత సూచించారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏవైనా తప్పులు ఉంటే స్థానిక రైతుసేవా కేంద్రానికి వెళ్లి సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి అరుణ, వ్యవసాయ విస్తరణాధికారి జి.లతమ్మ పాల్గొన్నారు.

- వెలుగోడు: మండలంలోని మోత్కూరు, మాధవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని రైతులకు ఆయన సూచించారు. వెటర్నరీ డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.
- కొత్తపల్లి: రబీ పంట సాగు జాబితాలో తప్పులుంటే ఆధారాలతో రైతు సేవా కేంద్రాలో సరి చేయించుకోవాలని ఏఓ మహేష్ సూచించారు. మంగళవారం కొత్తపల్లి పొలిమేరలోని మినుము పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, తెగుళ నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, రైతు సోదరులు పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని ఏడీఏ విజయశేఖర్, ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం తర్తూరు సమీప పొలంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సలహాలు ఇచ్చారు.
- నందికొట్కూరు: కోనేటమ్మపల్లి, వడ్డేమాన్ గ్రామాల పొలిమేరలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు.